క్లుప్తంగా

మహా మాజీ ముఖ్యమంత్రికి ఘన స్వాగతం



అశోక్ చవాన్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

బాసర: శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ రాజ్యసభ సభ్యుడు అశోక్ చవాన్‌కు బీజేపీ మండల అధ్యక్షుడు కిశోర్ దేశాయ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయినాథ్ పటేల్ సోమవారం ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ దత్తాత్రేయ ఆలయంలో అశోక్ చవాన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత ఆయన్ను శాలువాతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందించారు. ఆయన వెంట మహారాష్ట్ర నేతలు, బాసర బీజేపీ, బీజేవైఎం నాయకులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని కలిసిన గ్రామస్తులు



విఠల్‌రెడ్డితో గొల్లమాడ గ్రామస్తులు

నర్సాపూర్(జి): మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని భైంసా మండలం దేగాంలోని ఆయన నివాసంలో నర్సాపూర్(జి) మండలంలోని గొల్లమాడ గ్రామస్తులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు పెద్ద చెరువు మరమ్మతు, పెద్ద హనుమాన్ మందిర నిర్మాణ కోసం నిధులు మంజూరు చేసేలా చూడాలని విన్నవించారు. స్పందించిన ఆయన.. ఈ విషయాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

భీమన్న జాతర



మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

సోన్: మండలంలోని సాకేర గ్రామంలో భీమన్న జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. పవిత్ర గంగనీళ్లతో భీమన్నదేవుని గజాలను శుద్ధిచేసి ఆలయంలో ప్రతిష్ఠించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం మొక్కు చెల్లించుకున్నారు. పాడి పంటలు సమృద్ధిగా పండాలని, అందరూ చల్లగా చూడాలని వేడుకున్నారు. భక్తుల కోసం ఆదివాసీ నాయక్‌పోడ్‌లు అన్ని ఏర్పాట్లు చేశారు.

రేపు బీజేపీ అభినందన సభ

ఖానాపూర్: బీజేపీ ఎంపీగా గోడం నగేశ్ భారీ మెజార్టీతో విజయం సాధించడాన్ని పురస్కరించుకుని ఖానాపూర్ నియోజకవర్గంలోని మండలాల్లో ఈనెల 19న బీజేపీ అభినందన సభ ఉంటుందని బీజేపీ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సభలకు ఎంపీ గోడం నగేశ్‌తోపాటు బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబర్ రాథోడ్ రమేశ్ హాజరవుతారని పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు ఉట్నూర్‌లో, 11 గంటలకు జన్నారం, 12.30 గంటలకు కడెం, 3 గంటలకు ఖానాపూర్, సాయంత్రం 5 గంటలకు పెంబిలో సభ ఉంటుందని తెలిపారు. పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

నేడు ముధోల్ ఎమ్మెల్యే రాక

లోకేశ్వరం: మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ మంగళవారం వస్తున్నారని బీజేపీ ముధోల్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ సుమన్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నూతన నీటి శుద్ధికరణ ప్లాంట్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మండల కేంద్రంలో సబ్సిడీపై మంజూరైన టార్పాలిన్లను రైతులకు అందజేస్తారని పేర్కొన్నారు.

రేపు మండల సమావేశం

నర్సాపూర్(జి): స్థానిక రైతు వేదిక భవనంలో బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ కొండ్ర రేఖ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పుష్పలత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

ఘనంగా ఏకాదశి

ముధోల్: మండలకేంద్రంతోపాటు గ్రామాల్లో సోమవారం ఏకాదశి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఆలయాల్లో పూజలు నిర్వహించి మొక్కు చెల్లించుకున్నారు. భక్తులు ఉపవాస దీక్షలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



తానూరు: కోలూరులో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు



లోకేశ్వరం: రాజూరలో మసీద్‌లో ప్రార్థనలు చేస్తూ..

బక్రీద్ పండుగను జిల్లావ్యాప్తంగా సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. గడ్డెన్నవాగు ప్రాజెక్ట్ సమీపంలో ఈద్గా వద్ద సందడి నెలకొంది. పలుచోట్ల పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



భైంసాటౌన్: ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



సోన్ మండలం న్యూవెల్మల్ గ్రామంలో..



ఖానాపూర్: శుభాకాంక్షలు చెబుతూ..



సారంగపూర్: జామ్ గ్రామంలో..



లక్ష్మణచాందలో..



నర్సాపూర్(జి): శుభాకాంక్షలు తెలుపుతూ..



ముధోల్‌లో..



కుంటాల: ఓలాలో

కూరగాయల సాగు.. లాభాలు బాగు



పొట్టపెల్లి వద్ద సాగవుతున్న కూరగాయలు

- అధిక దిగుబడితో ఆదాయం
- తక్కువ పెట్టుబడితో సాగు
- పలువురు యువ రైతుల ఆసక్తి

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి, లక్ష్మణచాంద, రాచాపూర్, పీచర, మల్లాపూర్, నర్సాపూర్, చామన్‌పెల్లి తదితర గ్రామాల యువ రైతులు కూరగాయల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. తమ పంట పొలాల్లో, బోరుబావుల కింద నూతన పద్ధతుల్లో కూరగాయలు, ఆకుకూరలు పండిస్తూ లాభాలు గడిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో టమాట, వంగ, బీర, బెండ, బొబ్బరి, పాలకూర, గోంగూరతోపాటు కొత్తిమీర, మిర్చి సాగు చేస్తున్నారు. అధిక దిగుబడితో మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తుండడం విశేషం.

స్థానిక మార్కెట్‌లో విక్రయం..

మండలంలో సాగవుతున్న కూరగాయలు, ఆకుకూరలను రైతులు స్థానిక మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఆదివారం కనకాపూర్, సోమవారం లక్ష్మణచాంద, మంగళవారం పార్‌పెల్లి, బుధవారం పీచర, గురువారం బాబాపూర్, శుక్రవారం నర్సాపూర్, శనివారం రాచాపూర్ ఇలా ప్రతీరోజు ఏదో ఒక గ్రామంలో మార్కెట్‌కు వెళ్లి అమ్ముతున్నారు.

రెండెకరాల్లో సాగు చేస్తున్నా



రెండెకరాల్లో వంగ, బెండకాయ సాగు చేస్తున్నా. రోజుకు బెండకాయ 5 డబ్బాలు వస్తుంది. ఒక్కో డబ్బాలో 12 కేజీలు చొప్పున మొత్తం 60 కేజీలు వస్తుంది. కేజీ ధర రూ.40కు రోజు రూ.2400 వస్తున్నాయి.

– చిట్యాల అశోక్, రైతు, రాచాపూర్

ఆదాయం ఉంది



బీర సాగుతో ఆదాయం ఉంది. రోజుకు 3 పెట్టెలు వస్తుంది. 36 కేజీలకు మొత్తం రూ.3600 వస్తున్నాయి. సాగుకు పెట్టుబడి తక్కువ ఉంటుంది. అధిక దిగుబడితో ఆదాయం వస్తుంది. – రమణారెడ్డి, రైతు, పొట్టపెల్లి (కే)

విద్యుత్ సమస్యల పరిష్కారానికే ప్రజావాణి



ఖానాపూర్: ఈఆర్వో కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న వినియోగదారులు



కడెం: ఫిర్యాదు స్వీకరిస్తున్న ఏఈఈ సుమన్‌కుమార్

ఖానాపూర్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని చేపడుతుందని ఖానాపూర్ సబ్‌డివిజన్ విద్యుత్ శాఖ ఏడీఈ కేశెట్టి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఈఆర్వో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి హాజరై ఆరు దరఖాస్తులు స్వీకరించారు. సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ప్రతి సోమవారం మండల కేంద్రాల్లోని విద్యుత్ కార్యాలయాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి ఉంటుందని తెలిపారు. కార్యక్రమాన్ని వ్యవసాయ, వాణిజ్య, గృహ సంబంధమైన విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏవో సురేశ్, నాయకుడు షబ్బీర్‌పాషా, సబ్ ఇంజినీర్ వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

కడెంలో..

కడెం: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో గ్రామాల నుంచి ఐదు ఫిర్యాదులు వచ్చాయని ఏఈఈ సుమన్‌కుమార్ తెలిపారు. త్వరలో వాటిని పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఇందులో సబ్ ఇంజినీర్ స్వాతి, విద్యుత్ సిబ్బంది తదితరులున్నారు.



సోన్: ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

సోన్‌లో..

సోన్: మండల విద్యుత్ సహాయక ఇంజినీర్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ఏఈ శ్రీనివాస్, సబ్ ఇంజినీర్ విష్ణు, వినియోగదారులు హరీశ్‌రెడ్డి, ప్రసాద్, రాము పాల్గొన్నారు.

దిలావర్‌పూర్‌లో..

దిలావర్‌పూర్: స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయంలో విద్యుత్ సంబంధిత సమస్యలపై వినియోగదారుల నుంచి ఏఈ శ్రీనివాస్ అర్జీలు స్వీకరించారు. గృహ, వ్యవసాయ సంబంధిత విద్యుత్ సమస్యలు ఉన్న చోట ఫిర్యాదు చేసి తమ సమస్యను సత్వరమే పరిష్కరించుకోవాలని కోరారు.

వాహనాలు వెళ్లేది ఇలాగేనా..







జిల్లాకేంద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ చౌరస్తాలో ఎస్పీ క్యాంప్ కార్యాలయం ముందు నిత్యం వాహనాలు వెళ్తుంటాయి. ఎప్పుడు రద్దీగా ఉండే ఈ చౌరస్తాలో పోలీసులు బారీగేట్లు ఏర్పాటు చేయడంతో వాహనదారులు, పాదచారులు ఇక్కట్లు పడుతున్నారు. బాగులవాడ నుంచి ప్రియదర్శినినగర్ వెళ్లేదారిలో వీటిని ఏర్పాటు చేశారు. రోడ్డు దాటేందుకు వాహనదారులు ఇష్టారీతిన వెళ్తున్నారు. మాతాశిశు సంక్షేమ ఆస్పత్రి నుంచి వచ్చేవారు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

అ'పూర్వ' సమ్మేళనం



కుంటాల: కుంటాల ఉన్నత పాఠశాలలో 2002–03 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు సోమవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో చిన్ననాటి గుర్తులను నెమెరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నారుమడే కీలకం

- నేలలను బట్టి విత్తనాలు ఎంచుకోవాలి
- అప్పుడే పంట అధిక దిగుబడి

లోకేశ్వరం: రోహిణికార్తె ముగిసిన మృగశిర కార్తె ఆరంభమైంది. ఖరీఫ్ సాగుకు ఇప్పటికే రైతులు సన్నద్ధమవుతున్నారు. జిల్లా రైతులు సన్నరకం, దొడ్డు రకం పంటలవైపే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ముందుగా నారుమడిపై దృష్టిసారించాలని డీఏవో అంజిప్రసాద్ పేర్కొంటున్నారు. మంచి విత్తనాలు ఎంచుకోవాలి. అప్పుడే సరైన దిగుబడి వస్తుంది. పొలం మడిలో నారుమడి చేయొద్దు. ప్రతీ ఏడు మడులను మార్చాలి. అప్పుడే నారు ఏపుగా వస్తుంది. నారుమడి కోసం నీళ్లు పెట్టి కలియదున్నాలి. ఎత్తు వంపులు లేకుండా సరిచేసుకోవాలి. మడి దున్నిన వారం తర్వాత మొలక అలకాలి. ఐదురోజుల వరకు నీరుపెట్టి తీసివేస్తూ ఉండాలి. నాటు వేసే వారం ముందు 3జీ కార్బోఫ్యూరిడాన్ గుళికలు ఎకరాకు కిలో చొప్పున చల్లితే పురుగులు చనిపోతాయి.

నాట్లు వేయాలి

జిల్లాలో 1.45 లక్షల ఎకరాల్లో వరి సాగు కానుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఖరీఫ్‌లో రైతులు సన్నరకం పంట సాగు చేస్తున్నారు. దీని కాల పరిమితి 150 రోజులు పడుతుంది. ఎకరాకు 25 కేజీల విత్తనం సరిపోతుంది. నాటు 30–40 రోజుల మధ్య వేసుకుంటే దిగుబడి ఎక్కువగా వస్తుంది. రెండు నుంచి మూడు మొలకలు మాత్రమే నాటుకోవాలి. కొందరు రైతులు 6–8 మొలకలు నాటుతుంటారు. దీంతో దిగుబడి తగ్గే ప్రమాదం ఉంటుంది. సాధారణ వర్షపాతం నమోదైతేనే నార్లు పోసుకోవాలి. సబ్సిడీపై సన్నరకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. అయితే తెగుళ్ల వ్యాప్తి చెందకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలి. నాటు వేసిన 12–15 రోజుల మధ్య తొలివిడత ఎరువులు అందించాలి. ముఖ్యంగా వరికోతకు వచ్చే సమయంలో సుడిదోమ ఉధృతి చెందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ సమయంలో వ్యవసాయాధికారుల సూచనలు పాటించి సస్యరక్షణ చర్యలు పాటించాలి. దొడ్డు రకం పంట కాలపరిమితి 120 రోజులు. నాట్లు 22–25 రోజుల మధ్య వేసుకోవాలి. దొడ్డు రకం పంటలకు తెగుళ్ల వ్యాప్తి తక్కువగా ఉంటుంది.



వట్టోలిలో వరి నారుమడి

పచ్చిరొట్ట విత్తనాలు చల్లాలి

నాటువేసే ముందు పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకోవచ్చు. దీంతో భూమి సారవంతమవుతుంది. మండల కేంద్రాల్లో సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు లభిస్తాయి. జీలుగ విత్తనాలు చల్లిన తర్వాత 45 రోజుల తర్వాత కలియదున్నాలి. జీలుగ సాగులో ఎకరాకు 8 కిలోల భాస్వరం 20 కిలోల పొటాష్, 35 కేజీల నత్రజని లభిస్తుంది. 5–6 టన్నుల పచ్చిరొట్ట ఎరువు ఇస్తుంది. జూన్ మొదటి వారం నుంచే జీలుగ విత్తనాలు చల్లుకోవాలి.

అటెన్షన్ ప్లీజ్ ఆదమరిస్తే అంతే..



లక్ష్మణచాంద: మండలంలోని పీచర నుంచి న్యూవెల్మల్, బొప్పారం గ్రామాలకు వెళ్లేదారిలో చిన్న కాలువ వద్ద కల్వర్టుపై రక్షణ గోడ లేకుండా ప్రమాదకరంగా ఉంది. వాహనదారులు, ప్రయాణికులు ఆదమరిస్తే కాలువలో పడే ప్రమాదం ఉంది. అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

సంబంధిత అధికారి: శ్రీధర్ ఏఈ పీఆర్, సెల్: 89190 97486

సాగు పనుల్లో రైతులు బిజీ



కుంటాల: సాగు పనుల్లో రైతులు బిజీబిజీగా మారారు. మండలంలోని గ్రామాల్లో ఆదివారం రాత్రి వర్షం కురిసింది. ఇటీవల విత్తిన పత్తి, సోయా విత్తనాలు మొలకెత్తుతాయని హర్షం వ్యక్తం చేశారు. సోమవారం మరికొందరు విత్తనాలు విత్తుతూ, మొలకెత్తిన పంటలకు యూరియా వేశారు. కాగా, 32.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో సాయన్న తెలిపారు.